# చైతన్యరథం




బి. గీతిక



ఈ ‘చెలగాటం’ నవలని

“స్వాతి వీక్లీ”లో సీరియల్‌గా ప్రచురించిన

పూజ్యులు, గౌరవనీయులు, మేగజైన్ మొఘల్

**శ్రీ వేమూరి బలరాం** గారికి

నా హృదయపూర్వక ధన్యవాదాలు..

– బి.గీతిక

# వెల్కమ్

పొడుగాటి కాళ్ళు, తామర తూడుల్లాంటి చేతులు, కలువ పువ్వులాంటి ముఖం, తారల్ని తలదన్నే మెరుపుతో కూడిన కళ్ళు, ఎన్నో నెలవంకల్ని తెచ్చి కూర్చినట్టున్న వంపు సొంపుల అందమైన శరీరం,.. విశ్వంలోని అందమంతటినీ తెచ్చి రాశి పోస్తే ఎలా ఉంటుందో అలా ఉంది వెరోనిక రూపం.

మెరుపుతీగలాంటి ఆమె శరీరంలోని ఎత్తూపల్లాల కొలతలు ఎక్కడెక్కడ ఎంతెంత ఉండాలో సరిగా అలానే ఉన్నాయ్. నేవీ బ్లూ కలర్ ఫ్యాంట్, స్కై బ్లూ కలర్ షర్ట్ ధరించి, ఎయిర్‌బేస్‌లో నడుస్తోంది వెరోనిక. ఆమె అలా నడుస్తుంటే నీలి మేఘం ఒకటి ఆకాశాన్ని విడిచి వచ్చి ఇలపై నడుస్తోందా అన్నట్టుంది.

ఆమె వైపు ఒకసారి చూసినవారు ఎంతటి వారైనా సరే 'ఆహా ఏమి అందం' అనాల్సిందే. అంతటి అందం ఆమెది. ఇప్పుడు ఆమె కళ్ళు వజ్రపు అంచుల మాదిరి చురుగ్గా మెరుస్తున్నాయి. ఆమె పెదవుల వంపు ఇప్పుడు ఆమె చేయబోయే సాహసానికి ట్యాగ్‌లైన్‌లా ఉంది.

బైనాక్యులర్స్‌లో నుంచి ఆమె అందాల్ని మాత్రమే చాలాసేపట్నుంచీ తదేకంగా చూస్తున్నాడు ఇషాంత్. అతడి హైట్ ఆరడుగుల రెండు అంగుళాలు. ఎత్తుకు తగ్గ బలిష్టమైన శరీరం, నల్లగా నిగనిగలాడుతూ నుదుటి మీదకు పడుతున్న ఒత్తైన క్రాఫ్,

మిల్కీవైట్ స్కిన్ కలర్, ఎర్రటి పెదవులూ, నీలాకాశపు రంగులో కళ్ళు,.. రకరకాల రంగులన్నీ అతడి శరీరంలోనే ఇమిడి ఉన్నట్టు ఉంటాడు ఇషాంత్.

అతడొక ఇంపార్టెంట్ పని మీద బ్రిటన్ దేశంలోని లండన్ నగరం నుంచి ఇండియా వచ్చాడు. ఇప్పుడు ఆ పని మీదే ఉన్నాడు. వెరోనికనే చూస్తున్న ఇషాంత్ బైనాక్యులర్స్‌ని మరింత గట్టిగా పట్టుకున్నాడు. సైడ్ యాంగిల్‌లో కనిపిస్తున్న ఆమె అణువణువులోని అందం అతడికి మతి పోయేలా చేస్తోంది. వెరోనికని డైరెక్ట్‌గా చూడడం ఇదే ఫస్ట్‌టైమ్ అతడికి. ఆమె నడకలోని రిథమ్‌కి ఎగ్జైట్ అవుతూ బైనాక్యులర్స్ వ్యూని మరింత జూమ్ చేశాడు.

సరిగ్గా అప్పుడే అతడు నిరాశ పడేలా సైడ్ టర్న్ తీసుకుంది వెరోనిక. మరింత క్లోజప్‌లో చూడాలనుకున్న ఆమె అందం మిస్ అయ్యిందనుకున్నాడు ఇషాంత్. కానీ నిరాశ పడబోయిన అతడిని ఆమె బ్యాక్ పర్సనాలిటీ మరింతగా ఆకట్టుకుంది.

ఆమెని అలా వెనక నుంచి చూస్తుంటే ఆమె వేస్తున్న ప్రతి అడుగు అడుగులో ఓ అందమైన కవ్వింపు కనిపిస్తోంది. కనీసం రెప్పయినా కొట్టకుండా ఎంతో ఉద్విగ్నంగా, ఉత్సాహంగా కూడా చూస్తున్నాడు ఇషాంత్. అతడే కాదు, అక్కడున్న అందరూ ఆమెనే కాన్‌సెన్‌ట్రేట్ చేసుకుని చూస్తున్నారు. కానీ ఇషాంత్ చూసే దృష్టితో మాత్రం కాదు. అతడలా చూడడం వెనుక ఒక ప్రత్యేకమైన కారణం ఉంది.

ఇప్పుడు వాళ్ళు ఉన్న ప్లేస్ హైదరాబాద్‌కి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న దిండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అది. యుద్ధవిమానాల పై శిక్షణనిచ్చే మిలటరీ స్థావరం. ఆ అకాడమీ ఎయిర్‌బేస్‌లో ఇప్పుడు వైమానిక సాహస విన్యాసాలతో కూడిన గొప్ప 'ఎయిర్‌షో' జరుగుతోంది.

దేశ ప్రధాన మంత్రి, రెండు తెలుగు రాష్ట్రాల ఇద్దరు ముఖ్యమంత్రులూ, డిఫెన్స్ మినిస్టర్ మన్‌జిత్‌రాయ్, ఇంకా సైనిక, వైమానిక, నావికాదళాల చీఫ్‌లు కూడా అక్కడ కూర్చుని వైమానిక విన్యాసాల్ని వీక్షిస్తున్నారు.

ఇప్పుడు సాహస విన్యాసాలు చేయబోయేది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేస్తున్న 'ఫీమేల్ వార్‌ఫైటర్ పైలెట్' వెరోనిక. ఆమె సాహసం చేయబోయేది కూడా మామూలు విమానంతో కాదు, శత్రువుల్ని కొన్ని కిలోమీటర్ల దూరం నుంచే బూడిద చేయగల లేటెస్ట్ 'మిగ్' యుద్ధవిమానంతో..!

'వార్ ఫైటర్ పైలెట్' అవడం కోసం ఆమె ఈ దిండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలోనే ఎంతో కఠినమైన శిక్షణ తీసుకుంది. ఇండియాలోనే మొట్టమొదటి 'ఫీమేల్ వార్‌ఫైటర్ పైలెట్'గా ఎంపికయ్యి మెడల్స్ కూడా సాధించింది.

సరికొత్త మాడిఫికేషన్స్‌తో రష్యా తయారు చేసిన లేటెస్ట్ మిగ్ యుద్ధ విమానం పై ఆమె ఇప్పుడు ప్రయోగాత్మకంగా విన్యాసాలు చేయబోతోంది. ఆ 'వార్ ఎయిర్‌క్రాఫ్ట్' మీద వెరోనికకి ట్రైనింగ్ ఇచ్చిన రష్యన్ ఇంజనీర్స్ కూడా అక్కడ కూర్చుని ఉన్నారు.

విశాలమైన ఆ ఎయిర్‌బేస్ మధ్యలో ఎంతో ఎత్తుతో, వెడల్పాటి రెక్కలతో, నిగనిగలాడే నునుపైన మెరుపుతో, కవ్వించే పడుచుపిల్లలా ఉంది ఆ కొత్త 'యుద్ధ విమానం'. రష్యన్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ వాళ్ళు డిమాన్‌స్ట్రేషన్ కోసం భారతదేశానికి తీసుకొచ్చిన 'లేటెస్ట్ ఫైటర్ మిగ్ ఎయిర్‌క్రాఫ్ట్' అది.

ఆ ఫైటర్ విమానాన్ని సవాలుగా చూస్తూ, దాని దగ్గరకు నడుస్తోంది దాని కంటే ధీటుగా ఉన్న ఫైటర్ పైలెట్ వెరోనిక.

'ఎన్నడూ చూడనంత అపురూప లావణ్యంతో సౌందర్యదేవత వీనస్‌లా కనిపిస్తున్న ఈమె లేటెస్ట్ వార్‌ఎయిర్‌క్రాఫ్ట్ పై సాహసవిన్యాసాలు చేయగలదా' అనుకుంటూ ఒకింత అనుమానంతో చూస్తున్నాడు ఇషాంత్. అతడి కళ్ళకి ఆమె అలా కనబడుతోంది.

అందమైన రూపంలో నిండుగా మనోబలాన్ని కూడా నింపుకుని యుద్ధవిమానం వైపు వేగంగా అడుగులు వేసింది వెరోనిక. ఆ యుద్ధ విమానాన్ని నడపగల ధీటైన తెగువ ఆమె అడుగుల్లో ఎంతో స్పష్టంగా కనిపిస్తోంది చూసేవాళ్ళకి. కానీ వెరోనికకి మాత్రం అది తెగువలా లేదు. ఎంతో మనసైన యువకుడితో.. చేయబోయే రాసక్రీడ

మాదిరి అత్యంత ఆసక్తిగా, మరెంతో కవ్వింపుగా ఉంది.

అంత ఇష్టం ఆమెకి విమానం నడపడం అంటే. సింగిల్ సీటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అది. వెరోనిక పైలెట్ సీట్ వద్దకొచ్చి మెయిన్ ఇంజన్ ఆన్ చెయ్యడం కోసం ఆక్సిలరీ పవర్ యూనిట్‌ని స్విచాన్ చేసింది. అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

ఆక్సిలరీ పవర్ యూనిట్ రిలీజ్ చేసిన ఎనర్జీ సోర్స్‌తో మెయిన్ ఇంజన్‌నీ, టర్బోఫాన్ ఇంజన్‌నీ ఆన్ చేసిందామె. మెయిన్ ఇంజన్ ఆన్ అయిన కొన్ని సెకన్స్‌లోనే ఎయిర్‌క్రాఫ్ట్‌ని టేకాఫ్ చేసింది వెరోనిక. అంతే. పెద్ద శబ్దం చేస్తూ ఆ యుద్ధవిమానం మెరుపువేగంతో రివ్వున గాల్లోకి లేచింది.

కళ్ళ ముందు రింగులు రింగులుగా తిరుగుతూనే కొద్ది సెకన్స్‌కే అక్కడ కూర్చున్న అందరి కనుచూపుమేరనీ దాటి పోయింది. అంతే. అందరూ ఒక్కసారిగా స్టన్నయ్యారు. ఎందుకంటే అది అత్యంత వేగంతో గంటకు 2500 కిలోమీటర్లు దూసుకుపోగల వార్ ఎయిర్‌క్రాఫ్ట్.

కనీసం బైనాక్యులర్స్‌కి కూడా అందకుండా వెళ్ళిపోవడంతో, అప్పటివరకూ ఆమెనే కాన్సన్‌ట్రేషన్ చేసుకుని చూస్తున్న ఇషాంత్ ఉసూరుమన్నాడు. అయినాసరే ఎయిర్‌క్రాఫ్ట్ ఎటు వైపు నుంచి వస్తుందా అని బైనాక్యులర్స్‌ని అన్ని దిక్కులకీ తిప్పుతూ దానికోసం వెతికి చూస్తున్నాడు. అరనిమిషం గడిచేసరికి దూరంగా కనిపించింది. కనిపించిన మరుక్షణమే కళ్ళ ముందు ఎయిర్‌బేస్‌లోకి వచ్చేసింది.

అక్కడ అయిదే అయిదు సెకన్లు కిందకీ పైకీ ఊగిసలాడింది. మళ్ళీ వెంటనే విమానం మొత్తం రాకెట్ మాదిరి నిట్టనిలువుగా తిరిగింది. అంతే..! ఒక్కసారిగా అందరూ నించొని వావ్.. అంటూ ఆశ్చర్యంతో గట్టిగా కేకలు పెట్టారు. బైనాక్యులర్స్‌ని మాగ్జిమమ్ జూమ్ చేశాడు ఇషాంత్. అతడి కళ్ళ పరిధిలో ఆ విమానం తప్ప మిగిలిన ప్రపంచం అంతా శూన్యం అయిపోయింది.

రాకెట్‌లా నిట్టనిలువుగా ఉన్న ఆ యుద్ధవిమానం ఆకాశంలోకి ఒక్కసారిగా

దూసుకెళ్ళిపోయింది. అది వర్టికల్‌గా 350 మీటర్ల హైట్‌ని ఒకే ఒక్క సెకన్‌లో చేధించగలదు. అందుకే ఆమె ఎయిర్‌క్రాఫ్ట్ సెకన్స్‌లోనే మళ్ళీ కంటికి కనిపించకుండా పోయింది. మరో నాలుగు సెకన్స్‌కి ప్రత్యక్షమైనట్టుగా మెరిసింది. బైనాక్యులర్స్‌ని కళ్ళ ముందు నుంచి తీయకుండానే ఆశ్చర్యంతో ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు ఇషాంత్.

ఆ యుద్ధవిమానాన్ని కాగితపు బొమ్మ మాదిరిగా తిప్పుతూ రకరకాల విన్యాసాలు చేస్తోంది వెరోనిక. వాటిని మైమరచి షాకింగ్‌గా చూస్తున్నాడు ఇషాంత్. ఆమె చేస్తున్న విన్యాసాలన్నీ తన కోసమే అనిపిస్తోంది ఇషాంత్‌కి. ఆమెని అందుకోమంటూ చాలెంజ్ విసురుతున్నట్టుగా కూడా ఫీలయ్యాడు.

'అట్లాంటా'ని గెలుచుకోవడం కోసం ఆమెతో పరుగు పందెం పోటీలో, ప్రేమదేవత ఇచ్చిన గోల్డెన్ యాపిల్స్ సహాయం తీసుకున్నాడు ఓ గ్రీకువీరుడు హిపోమెనిస్. కానీ వెరోనిక అందాన్ని గెలుచుకోవడానికి ఇప్పుడు ఇషాంత్ చేతిలో గోల్డెన్ యాపిల్ లేదు. కానీ అతడి దగ్గర అంతకంటే విలువైన బ్రెయిన్ మాత్రం ఉంది.

కొన్ని నిమిషాల తర్వాత యుద్ధవిమానాన్ని శరవేగంగా దించి, దానిని నిర్దిష్ట స్థానంలో నిలిపింది వెరోనిక. ఇక ఇషాంత్ దృష్టి మొత్తం మళ్ళీ వెరోనిక మీదనే నిలిచిపోయింది. ప్రకృతిలోని అద్భుత సోయగాలన్నీ ఆమె శరీరంలోని అణువణువులో కనిపిస్తున్నాయి అతడికి.

అక్కడున్న అందరూ కూడా ఒక గొప్ప ప్రపంచ వింతని చూస్తున్నట్టుగా ఆమెనే చూస్తున్నారు. నిజంగానే ఆమె ఒక ప్రపంచ వింత. ప్రపంచంలోనే అత్యంత చిన్న వయసు ఫీమేల్ ఫైటర్‌పైలెట్ ఆమె. అది అందరికీ తెలిసి. కానీ ఆమె మెయిన్ ప్రొఫెషన్ 'డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ' (DIA)లో రహస్యంగా ఇన్వెస్టిగేషన్స్ చేసే సీక్రెట్ ఏజెంట్. అలాగే వెపన్ డిజైనింగ్ కోర్స్ కూడా పూర్తి చేసి, దేశ రక్షణ కోసం కొత్త కొత్త మోడల్ వెపన్స్‌ని క్రియేట్ చేస్తోంది.

ఆమె కుటుంబం మొత్తం ఈ దేశ సేవకే అంకితం అయ్యింది. ఆమె తాతగారు

కోసూరి సీతారాముడు గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు. ఈ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడి ఎన్నోసార్లు జైలు జీవితం గడిపారు. ఆయన ఇప్పుడు లేకపోయినా ఆయనలోని దేశభక్తి ప్రభావం ఆమె మీద ఎంతో బలంగా ఉంది.

ఆమె తండ్రి సుభాష్‌చంద్ర.. ఇప్పుడు డిఫెన్స్ ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌కి కంట్రోలర్ జనరల్ (CGDA). సుభాష్‌చంద్ర ఉద్యోగం నిమిత్తమే ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీకి వచ్చి సెటిలయ్యింది వాళ్ళ ఫ్యామిలీ.

చిన్నప్పటి నుంచీ కూడా వెరోనికది మల్టీ టాలెంటెడ్ బ్రెయిన్. అర్థంకానిది అంటూ ఏమీ లేదామెకి. ఏ పని మొదలుపెట్టినా దానిని చాలా పర్‌ఫెక్ట్‌గా, ఎంతో వేగంగా పూర్తి చేయాలనే తపనతో ఉంటుంది. అందుకే డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెంట్‌గా ఆమె బాస్ చతుర్వేది నుంచి బెస్ట్ ఏజెంట్ నమ్మకాన్ని సంపాదించుకుంది. వాటన్నిటికీ తోడైంది ఆమెలోని అద్వితీయ అందం.

యుద్ధ విమానంలోంచి కిందకి దిగి, చాలా హుందాగా ఎంతో ఠీవిగా నడచి వస్తోంది వెరోనిక. చిన్నపిల్లలు ఆట ఆడుకున్న మాదిరిగా అతి పెద్ద భారీ యుద్ధ విమానంతో అవలీలగా ఎన్నో ఫీట్స్ చేసి; ఇప్పుడు గ్యాలరీలో ముందువరుసలో కూర్చున్న ఇండియా ప్రైమ్ మినిష్టర్, డిఫెన్స్ మినిష్టర్ మన్‌జిత్‌రాయ్, డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్ చతుర్వేది, ఇంకా వైమానిక, రక్షక, నావికా దళాల చీఫ్‌ల దగ్గరకొచ్చి ఎంతో వినయంగా ఇండియన్ మిలటరీ సెల్యూట్ కొట్టిందామె. వాళ్ళు కూడా గౌరవంగా ప్రతిసెల్యూట్ చేశారు.

ప్రధానమంత్రితో పాటూ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, నేవీ చీఫ్‌లు ముగ్గురూ ఆమెని అభినందించారు. అక్కడే ఉన్న రష్యన్ ఇంజనీర్స్‌తోనూ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌తోనూ ఎయిర్‌క్రాఫ్ట్‌లోని ప్లస్‌లు, మైనస్‌ల గురించి మాట్లాడుతోంది వెరోనిక.

బైనాక్యులర్స్‌లోంచి.. మాట్లాడుతున్న ఆమె ముఖాన్ని మాత్రమే తదేకంగా చూస్తున్నాడు ఇషాంత్. విశాలమైన నుదురు, ముఖం మీద రెండు కొండల ఆకారంలో

ఉండి క్షితిజ రేఖ మాదిరిగా ఆ వైపు నుంచి ఈ వైపుకి కలిసిపోయిన ఐబ్రోస్, పెద్ద కళ్ళు, సన్నగా పొడుగ్గా జాలువారే జలపాతం మాదిరిగా ఉన్న అందమైన ముక్కు, నిండైన బుగ్గలూ, చిన్న పెదవులూ, మాట్లాడుతున్నప్పుడు వాటి వింతైన కదలికలూ.. సూదిగా ఉన్న చిన్,.. ఇంకా ఇంకా పరీక్షిస్తూ కిందకు దిగింది అతడి చూపు.

అంతే. ఆ అందాల మత్తులో మతిపోయింది ఇషాంత్‌కి. ఆ షాక్‌లో సమయం అస్సలు తెలియలేదు. ఇంక వేరెవరి విన్యాసాలూ చూడలేకపోయాడు అతను.

బైనాక్యులర్స్‌లోంచి వెరోనిక రూపం కనుమరుగు అయ్యి చాలాసేపు అయ్యింది. ఎప్పటికో ఏవేవో ఊహల్లోంచి తేరుకుని ఒక్కసారిగా ఆమె కోసం చుట్టూ చూశాడు ఇషాంత్. ఎక్కడా కనబడలేదు వెరోనిక. అప్పటికే ఎయిర్‌బేస్ బయటకు వెళ్ళిపోయింది ఆమె. 'మైండ్ బ్లోయింగ్ ఫిజిక్' అని మనసులోనే అనుకుంటూ, వడివడిగా బయటకు వచ్చాడు.

అప్పటికే డ్రస్ ఛేంజ్ చేసుకుని కార్ పార్కింగ్ దగ్గర ఉన్న వెరోనిక మెరుపు మెరిసిన మాదిరిగా కనిపించింది. అంతే. క్షణంలో బైక్ పార్కింగ్‌లోని తన బైక్ వైపు దూసుకెళ్ళాడు. బైక్ బ్యాక్‌హుక్‌లోంచి హెల్మెట్ తీసి అతడి ముఖం అస్సలు కనిపించ కుండా జాగ్రత్తగా పెట్టుకున్నాడు. ఆ వెంటనే యాక్సిలరేటర్ రేజ్ చేసి వెరోనిక వైపు బైక్‌ని పోనిచ్చాడు ఇషాంత్.

సరిగ్గా అప్పుడే కార్ డోర్ తీస్తోంది వెరోనిక. ఆమెకి దగ్గరగా వచ్చి, ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌తో సడెన్‌గా బైక్ ఆపాడు.

ఆ వెంటనే, "హాయ్..! యువర్ ఫీట్స్ ఆర్ రియల్లీ మైండ్ బ్లోయింగ్..! నైస్ టూ మీట్ యూ.." అంటూ హఠాత్తుగా వెరోనిక చెయ్యి పట్టుకుని షేక్‌హ్యాండ్ ఇచ్చాడు ఇషాంత్. చివ్వున చూసింది వెరోనిక.

కొన్ని నిమిషాల క్రితం యుద్ధవిమానాన్ని నడిపిన ఆమె అందమైన చెయ్యి ఇప్పుడు ఇషాంత్ గుప్పిట్లో ఉంది. వెంటనే, "సీ యూ సూన్.." అంటూ ఆమెచేతిని తన వైపు

లాక్కుని, చిన్నగా నొక్కి ఆమె కళ్ళల్లోకి చూశాడు.

మిలమిల మెరిసే వజ్రకాంతుల్ని పోగు చేసి ఆమె తన కళ్ళల్లో దాచిపెట్టుకుందా అన్నంతగా మెరుస్తున్నాయి ఆమె కనులు. వాటిలోని ఆకర్షణ ఇషాంత్‌ని అక్కడే వుండమని కట్టిపడేస్తోంది. అయినా కూడా సెకన్‌లోనే తేరుకుంటూ ఆమె రియాక్ట్ అయ్యేలోపే చెయ్యి వదిలి అక్కడ నుంచి ఎంతో స్పీడ్‌గా ఎస్కేప్ అయిపోయాడు.

ఏం జరిగిందో వెరోనికకి అర్థమయ్యేసరికి, ఇషాంత్ బైక్ ఆ పరిసరాలలోంచి దూరంగా వెళ్ళిపోయింది. అతడు హెల్మెట్ పెట్టుకోవడంతో ఆ మనిషి ఎవరూ అనేది కనిపెట్టలేకపోయింది వెరోనిక. ఐబ్రోస్ ముడిచి, అతడు వెళ్ళిన వైపు పరీక్షగా చూస్తూ ఓ క్షణం అలాగే నిలబడింది.

తర్వాత డ్రైవింగ్ సీట్‌లో కూర్చుంటూ, చేతులకి ఏదో అంటుకున్నట్టు అనిపించి అతడు షేక్‌హ్యాండ్ ఇచ్చిన తన అరిచేతి వంక చూసుకుంది. అంతే. ఆ చేతికి గులాబి కలర్ గులాల్ అంటుకుని ఉంది. ఆమె వేసుకున్న డ్రెస్ కలర్ కూడా సేమ్ అదే కలర్. షాకింగ్‌గా చేతినీ, డ్రెస్‌నీ మార్చిమార్చి చూసుకుంది.

హోలీ పండుగలో చెమ్కీలతో కలిపి వాడే గులాబి రంగు గులాల్ అది. అప్పటికే ఆ గులాల్ ఆమె డ్రెస్‌కీ, కారు డోర్‌కి కూడా అంటుకుంది. ఆ రంగులో, అతడు చేసిన పనిలో చిలిపిదనం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అరిచేతిని చూసుకుంటున్న వెరోనిక పెదవులు చిరునవ్వుతో సన్నగా విచ్చుకున్నాయి.

ఇది అతడు చిలిపితనంతో చేసిన అల్లరిపనిలా అనిపించింది ఆమెకి. కానీ అతడు ఆమెకి తెలీకుండానే ఆమె మనసుతో ఎంతో యుక్తిగా చెలగాటం ఆడబోతున్నాడని; దానికి ఇది ఫస్ట్‌స్టెప్ అని అస్సలు ఏ మాత్రం ఊహించలేదు వెరోనిక.

× × ×

నల్లమల అడవుల్లోని మిలటరీ క్యాంప్ అది. అర్ధరాత్రి చుట్టూ గాఢమైన చీకటిగా ఉంది. అప్పుడే నిద్రకు ఉపక్రమిస్తున్నాడు కల్నల్ బెనర్జీ. కళ్ళు మూసిన అతడి రెప్పల

కింది కనుగుడ్లు ఏదో అలికిడికి కంగారుగా అటూ ఇటూ కదిలాయి. ఎవరో దొంగతనంగా టెంట్ లోపలకి చొరబడ్డారని అతడి బ్రెయిన్‌కి అనిపించింది. అంతే. సడెన్‌గా కళ్ళు తెరిచి లేచి కూర్చున్నాడు.

ఆ చీకట్లోనే టెంట్ అంతా ఓసారి కలియ చూశాడు. ఆ వెంటనే అతడి చేయి వేగంగా చార్జింగ్ లైట్ మీదకి వెళ్ళింది. తెల్లని వెన్నెల్లాంటి వెలుగు లోపలంతా పరుచుకుంది. లైట్ వెలుగులో నిశితంగా పరీక్షించి చూశాడు. ఎవరూ లేరు. అంతా నిశ్శబ్దం..!

దూరంగా మంటలేసుకుని నైట్ డ్యూటీ సోల్జర్స్ కాపలా కాస్తున్నారు. రేపు ఒక ముఖ్యమైన ఆపరేషన్ చెయ్యాల్సి ఉంది. దాని గురించి మాట్లాడుకుంటున్నారు వాళ్ళు.

ఇక్కడికి బయటివాళ్ళు ఎవ్వరూ వచ్చే ఛాన్స్ అస్సలేమాత్రం లేదని బెనర్జీకి గొప్ప నమ్మకం ఉంది. ఎందుకంటే ఈ క్యాంప్ ఉన్న లొకేషన్ సౌత్ ఇండియాలోని దట్టమైన అటవీ ప్రాంతం. సౌత్ స్టేట్స్‌లో ఒక ముఖ్యమైన సీక్రెట్ ఆపరేషన్ నిమిత్తం ఎంతో పకడ్బందీగా ఏర్పాటు చేసిన మిలటరీ క్యాంప్ ఇది.

కానీ బెనర్జీ సెన్స్‌కి 'ఎవరో తనని రహస్యంగా చూస్తున్నారని' ఇంకా ఏదేదోగా అనిపిస్తోంది. కానీ ఎవ్వరూ కంటికి కనిపించడం లేదు. లోపల మరింత పరీక్షగా చూస్తున్నాడు బెనర్జీ. ఫోల్డెడ్ బెడ్, పక్కనే చిన్న ఐరన్‌సేఫ్ లాకర్.. అంతా నార్మల్‌గానే ఉంది.

కానీ ఎందుకో బెనర్జీకి మాత్రం లోపలికి ఎవరో వచ్చి అతన్నీ, అతడి మెదడు లోపలి ఆలోచనల్ని కూడా చూస్తున్నారు అని వింతగా అనిపించింది. ఈ ఫీలింగ్ ఏమిటో ఏం అర్థంకాలేదు. ఒకింత ఆందోళన కూడా కలిగింది. అప్పుడే మెల్లగా హెడేక్ స్టార్టయ్యింది. అది ఉన్నట్టుండి హఠాత్తుగా తట్టుకోలేనంత స్థాయికి ఒక్కసారిగా పెరిగిపోయింది.

ఎవరో శత్రువు అదృశ్యంగా ఉండి తన మెదడులోంచి ఏదో లాగేస్తున్నాడు అన్న

ఫీలింగ్ కలుగుతోంది. రాత్రి సుబేదార్ రాంసింగ్ తీసుకొచ్చిన ఒక సీక్రెట్ ఇన్ఫర్మేషన్ అతడి ఆలోచనల మధ్య కదలాడింది. అసలే ప్రస్తుతం ఎంతో ఎలర్ట్‌గా ఉండాల్సిన పరిస్థితి. బహుశా అందువల్లే తనకి ఈ పిచ్చిపిచ్చి సెన్సేషన్ కలుగుతోందేమో అని సమర్థించుకుందామని చూశాడు కల్నల్ బెనర్జీ.

కానీ 'ఇది భ్రాంతి కాదు. ఖచ్చితంగా నిజం' అని అతడి సిక్త్‌సెన్స్ ఎంతో గాఢంగా హెచ్చరిస్తోంది. అంతే. వెంటనే ఎలర్ట్ అయ్యి, తన తుపాకీని బయటకు తీసి పట్టుకున్నాడు.

రాత్రి రాంసింగ్‌తో అతడు మాట్లాడిన మాటలూ, ఇంకా అతని బ్రెయిన్‌లో ఉన్న జ్ఞాపకాలన్నీ వద్దనుకున్నా డివిడి ప్లేయర్‌లో ఎవరో రీప్లే ఇచ్చినట్టు ఆటోమేటిక్‌గా బెనర్జీ మైండ్‌లో కదలడం మొదలుపెట్టాయి. అదే టైమ్‌లో ఎవరో బరువైన సుత్తితో అతడి నెత్తిమీద గట్టిగా మోదుతున్నట్టుగా అనిపించింది. కానీ నిజంగా అక్కడ ఎవరూ కనబడటం లేదు.

బయటకు అడుగులు వేద్దామని చూశాడు. సాధ్యం కాలేదు. మెడ మీది తలని ఎవరో బలవంతాన పెకిలించేస్తున్నంత నొప్పిగా ఉంది. అతడి స్కల్‌ని తొలగించి, మెదడులోని రహస్యాల్ని చూస్తున్నట్టుగా అనిపిస్తోంది. కళ్ళ ముందు మాత్రం ఎవ్వరూ కనిపించట్లేదు. ఇక నిలబడలేక మంచం మీద పడిపోయాడు బెనర్జీ.

హెడేక్ అంతకంతకీ పెరుగుతోంది. అంత హెడేక్‌లో కూడా ఒక విషయం మాత్రం అతడికి ఎంతో స్పష్టంగా తెలుస్తోంది. 'ఎవ్వరికీ తెలియకూడని తనలోని రహస్యాలన్నీ తన అనుమతి లేకుండానే మరొకరికి తెలిసిపోతున్నాయని'. అంతే. ఏదైనా బలమైన దానితో తన తలని తానే గట్టిగా కొట్టుకోవాలనిపించింది బెనర్జీకి. కానీ లేవలేని నిస్సహాయస్థితిలో ఉన్నాడు. గట్టిగా అరుద్దామంటే మాట కూడా రావట్లేదు.

శారీరకంగా ఎంతో బలిష్టంగా ఉంటాడు బెనర్జీ. కానీ ఇప్పుడు జరుగుతున్నది.. అతడి శారీరక బలం ఏ మాత్రం పనిచేయని టెక్నికల్ ఎటాక్..! శరీరానికి అలవాటైన

డిఫెన్స్‌ని ఇప్పుడు అతడి బ్రెయిన్ కూడా తన శాయశక్తులా చేస్తోంది.

మెదడులో ఏ ఒక్క న్యూరాన్‌లోని డేటా కూడా లీక్ అవ్వకుండా, అప్పటికప్పుడే కట్టుదిట్టంగా ప్లాన్ చేస్తోంది. కానీ బెనర్జీ బ్రెయిన్ వేస్తున్న ప్లాన్స్ అన్నీ స్ప్లిట్ సెకన్‌లోనే అవతలి వ్యక్తికి డీకోడ్ అయిపోతున్నాయి. ఈ అదృశ్యయుద్ధంలో విన్ అవడం ఎంతో అసాధ్యమని అతడి బ్రెయిన్ గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు. అంతే. క్రమేపీ అతడి బ్రెయిన్‌లోని శక్తి యావత్తూ సన్నగిల్లిపోయింది. ఆ విషయం బెనర్జీ కాన్షియస్‌కి అర్థం కాగానే, ఒక్కసారిగా భయపడ్డాడు.

ఆ భయమే శత్రువుకి మరింత బలాన్నిచ్చింది. అంతే..! శత్రువు టార్గెట్ కొన్ని నిమిషాల్లో చాలా సులువుగా పూర్తైంది. ఆ వెంటనే బెనర్జీ తలనెప్పి కూడా దానికదే క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది.

ఎదుటివ్యక్తి మెదడులో చాలా భద్రంగా ఉండాల్సిన ఎంతో నిగూఢమైన రహస్యాలూ, అతడి జ్ఞాపకాలూ ఇప్పుడు మరో బ్రెయిన్‌లోకి చేరిపోయాయి. రక్షణావ్యవస్థకి సంబంధించిన అత్యంత విలువైన రహస్యాల్ని తెలుసుకున్న ఆ మరో వ్యక్తి పెదాలు వ్యంగ్యంగా విచ్చుకున్నాయి.

ఎన్నో గొప్పగొప్ప సంస్థల కంప్యూటర్లను హ్యాక్ చేసి, వాటిలోంచి విలువైన సీక్రెట్స్‌ని కొల్లగొట్టడం ఆధునిక టెక్నాలజీలోని చీకటి కోణం. కానీ మనుషుల బ్రెయిన్ అనేది మనం తయారు చేసిన కంప్యూటర్ లాంటిది కాదు. అంతకంటే ఎక్కువ. అది హ్యాక్ చేయబడదు. ఇప్పటి వరకూ అలా ఎక్కడా జరగలేదు. కానీ ఇప్పుడు జరిగింది అదే.

**ఇదొక కొత్తరకం దోపిడీ..!** దొంగతనం చేయబడేది బంగారం కాదు, డబ్బు కాదు, వస్తువులు కాదు, అందం కాదు, అవయవాలు కాదు, ఇవేవీ కాదు. మనిషి మెదడు పొరల్లో ఎంతో భద్రంగా దాచుకున్న విలువైన రహస్యాల్ని బలవంతంగా ఆ మనిషికే తెలియకుండా దోచుకునే దోపిడీ..!

ఎవ్వరికీ చెప్పని అత్యంత రహస్యమైన సమాచారాన్ని సైతం ఎంతో అత్యాధునిక టెక్నాలజీ సహాయంతో మరెంతో తెలివిగా చేసే **బ్రెయిన్ దోపిడీ**..!!

× × ×

అర్ధరాత్రి అయినా వెరోనికకి నిద్ర పట్టడం లేదు. బెడ్ మీద వెల్లకిలా తిరిగి, ఒకలాంటి విరహంతో రెండు చేతులూ పైకి లేపి తలగడకి అటూ ఇటూ పెట్టుకుంది. ఆమె ఒళ్ళంతా భారమై ఏదో తీయనైన హాయి కోసం చూస్తున్నట్టుగా ఉంది. అసలే గులాబీ రంగులో ఉండే ఆమె అరిచేతులు.. ఇంకా పూర్తిగా వదలని గులాల్ రంగు వల్ల మరింత ఎర్రగా, కందిన ఆడపిల్ల బుగ్గల మాదిరి అందంగా కనిపిస్తున్నాయి.

మామూలుగా అయితే లేటెస్ట్ మోడల్ యుద్ధవిమానంతో ఆమె చేసిన విన్యాసాల ఎగ్జైట్‌మెంట్‌కి ఈ రాత్రంతా నిద్రపోయేది కాదు. కానీ ఇప్పుడు మాత్రం ఆమె నిద్రకి దూరమైన కారణం.. ఇషాంత్. అతడు చేసిన చిలిపి పని.

వెరోనిక తన డ్యూటీలో భాగంగా రోజూ ఎంతో మందిని కలుస్తుంటుంది. కొత్త వ్యక్తులు పరిచయం అయినప్పుడు వాళ్ళకి షేక్‌హ్యాండ్ ఇవ్వడం చాలా సాధారణ విషయం. కానీ ఎందుకో సాయంత్రం షేక్‌హ్యాండ్ ఇచ్చిన ఇషాంత్ టచ్ చాలా వేరుగా ఉంది ఆమెకి.

ఆ స్పర్శ, ఆ కొంటెతనం ఇప్పటి వరకూ ఆమెకి అస్సలు పరిచయం లేనిది. వుండుండీ అతడి బలమైన చేయి ఇప్పటికీ ఆమె చేతిని పట్టుకుని ఇంకా నొక్కుతున్నట్టుగానే అనిపిస్తోంది.

వెరోనిక నిద్రపోకుండా చేపపిల్లలా గిలగిలా కొట్టుకోవడాన్ని ఓరగా గమనిస్తోంది, ఆమె పక్కనే పడుకున్న ఆమె చెల్లెలు మేఘన. ఈ అర్ధరాత్రి సమయంలో అక్కకి నిద్ర పట్టనివ్వని 'డేంజరస్ గై' ఎవరా అని ఊహిస్తూ, అక్క మనసులో చెలరేగుతున్న కోరికల్ని తెలుసుకోవాలనుకుంది. అంతే. సుతారంగా వెరోనిక నడుము చుట్టూ చేతిని వేసి, "అక్కా.." అని మెల్లగా పిలిచింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Chelagatam](http://kinige.com/book/Chelagatam)

* * *